సాక్షి
కుమురం భీం

మంగళవారం । 23 । మే । 2023



కాలువలోకి దూసుకెళ్లిన బైక్

కుమురంభీం ప్రాజెక్టు కాలువలోకి బైక్ దూసుకెళ్లిన ఘటనలో లెండిగూడకు చెందిన సాక్రుబాయి మృతి చెందారు. ఆమె భర్త ప్రాణాలతో బయటపడ్డారు. 8లో ▸



ఒకేచోట ఆరు ప్రకృతివనాలు

రొంపెల్లి శివారులో ఒకేచోట ఆరు గ్రామాలకు చెందిన ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటికి కనీసం గేటు, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.6 /29.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశంలో కొంతమేర మబ్బులు ఉంటాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత కొనసాగుతుంది.

మండుటెండల్లో పడిగాపులు

- జిల్లాలో పుంజుకోని వరి ధాన్యం సేకరణ
- కేంద్రాల వద్దే రైతుల నిరీక్షణ
- పలుచోట్ల లారీలు, హమాలీలు, గన్నీ సంచుల కొరత
- జిల్లాలో 30 కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటివరకు 12వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు



దహెగాం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

కౌటాల/పెంచికల్‌పేట్/దహెగాం: వరి ధాన్యం అమ్ముకునేందుకు జిల్లాలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రోజుల తరబడి మండుతున్న ఎండలకు నిరీక్షిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. లారీలు, హమాలీలు, గన్నీ సంచుల కొరత కారణంగా పలుచోట్ల కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 17వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు కేవలం 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మరో పది రోజుల్లో యాసంగి సీజన్ ముగియనున్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

30 కొనుగోలు కేంద్రాలు..

యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 26, ఐకేపీ ఆధ్వర్యంలో 4 మొత్తం 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 15రోజుల క్రితమే కొనుగోళ్లు ప్రారంభమైనా ఇప్పటివరకు ఊపందుకోలేదు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కొన్నిచోట్ల హమాలీలు సాయంత్రం, రాత్రి పూట మాత్రమే తూకం వేస్తున్నారు. లారీలు కూడా సకాలంలో రాకపోవడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. గన్నీ సంచుల కొరత సైతం ఇబ్బందులకు గురిచేస్తోంది. ధాన్యం విక్రయించిన రైతులకు మూడు రోజుల్లోనే నగదు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటివరకు జిల్లాలో ఒక్కరి ఖాతాల్లో కూడా నగదు జమ కాలేదు.

దహెగాంలో తీవ్ర జాప్యం..

వరి కోతలు ప్రారంభమై నెలరోజులవుతుండగా, దహెగాం మండల వ్యాప్తంగా ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సహకార సంఘం ఆధ్వర్యంలో ఆరు, ఐకేపీ ఆధ్వర్యంలో ఒకటి నిర్వహిస్తున్నారు. 60 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించాలనే లక్ష్యం ఉండగా, కేవలం ఎనిమిది వేల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేశారు. చౌక గ్రామ రైతులు వడ్లు కొనడం లేదని శనివారం ఆందోళన చేశారు. క్వింటాలుకు ఐదు నుంచి ఏడు కిలోల వరకు కోత విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కౌటాలలో లారీలు రాక..

కౌటాల మండలంలో గురుడుపేట ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో కౌటాల, కుంబారి, వీరవెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో సాండ్‌గాంలో ఏర్పాటు చేశారు. లారీలు రాకపోవడం, ఎండల కారణంగా ధాన్యం తూకం మందకొడిగా సాగుతోంది. వీరవెల్లిలో స్థానిక ఏఈవో సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయక కొనుగోళ్లలో అంతరాయం కలుగుతోంది. ఈ నెల 9న నాలుగు కేంద్రాలు ప్రారంభించగా.. ఇప్పటి వరకు కుంబారిలో 688 క్వింటాళ్లు, కౌటాలలో 816 క్వింటాళ్లు, వీరవెల్లిలో 1,644 క్వింటాళ్లు, సాండ్‌గాంలో 1,681 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.



కౌటాల మండలం వీరవెల్లి కేంద్రం వద్ద ధాన్యం

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం

జిల్లాలో ఇప్పటికే 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. కేంద్రాల వద్దే రైతులు, ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. మరో రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం.

– తారామణి, డీసీవో

వేగవంతం చేయాలి



రెండెకరాల్లో వరి వేశా. పంట కోసి పదిహేను రోజులు దాటింది. కొనుగోలు కేంద్రం ఆలస్యంగా ప్రారంభం కావడంతో కల్లంలోనే ధాన్యం ఆరబెడుతున్నా. కొనుగోళ్ల వేగవంతం చేయాలి.

– కుకిడె సత్యన్న, పెంచికల్‌పేట్

మిషన్లు దొరుకుతలేవు



కోతలు పూర్తయి 20 రోజులు దాటింది. వడ్లు కొనుగోలు కేంద్రానికి తెచ్చినా తూ ర్పారా పట్టకుంటే కొన డం లేదు. తూర్పారాకు మిషన్లు దొరకడం లేదు. ఇక్కడే ఒక్కటే ఉంది. వడ్ల కుప్ప వద్దకు పశువులు రాకుండా ఎండలోనే ఉంటున్నా.

– ఎల్కరి సంగన్న, దహెగాం

నెల రోజులుగా కల్లంలోనే..



కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చి నెల రోజులైంది. ఎండకు ఆరబెట్టినా ఇంకా కాంట పెడుతలేరు. దీంతో రోజూ కుప్పల వద్ద కాపల ఉండాల్సిన పరిస్థితి. అధికారులు వచ్చినా కాంట కాకపోవడంతో ధర్నా చేయాల్సి వచ్చింది.

– రౌతు తిరుపతి, కుంచవెల్లి, మం.దహెగాం

నీళ్లు కూడా లేవు



కౌటాల కేంద్రానికి వడ్లు తెచ్చి రెండు రోజులుగా ఇక్కడే ఉన్నాం. లారీ సకాలంలో రాక తూకం ఆలస్యమవుతోంది. ఇక్కడ కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేవు. అకాల వర్షం వస్తే వడ్ల పరిస్థితి ఎంటనేది తెలియడం లేదు.

– సంతోష్, గుడ్లబోరి, మం.కౌటాల

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారసత్వంగా వచ్చిన తాత ఇంటిని అనుమతి లేకుండా రికార్డుల్లో తన సోదరుడు ఏ.రమేశ్ పేరుతో మార్చారని జిల్లా కేంద్రంలోని మార్కండేయ కాలనీకి చెందిన అనుమాండ్ల గణేశ్ ఫిర్యాదు చేశాడు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్తి మార్పిడికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి, జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. బజార్‌వాడిలో తండ్రి మహ్మద్ ముంతాజ్ పేరుతో ఉన్న ఇంటి(నం.3.38)ని గ్రామ పంచాయతీ అధికారులు తన తమ్ముడు ఎండీ ముర్తుజ్ హుస్సేన్ పేరుతో మార్చారని కాగజ్‌నగర్‌కు చెందిన తాజ్‌బేగం ఫిర్యాదు చేసింది. జీవో 59 ప్రకారం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న భూమికి 50 శాతం రాయితీ తో రుసుం చెల్లించే అవకాశం కల్పించాలని జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ హుస్సాద్దీన్ అర్జీ సమర్పించాడు. దహెగాం గ్రామ శివారులోని భూమికి కొత్త పట్టా పాసుపుస్తకం జారీ చేసి, 'ధరణి'లో నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆలం హన్మంత్ కోరాడు. కూలీ పనిచేసుకుంటున్న తనకు ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామానికి చెందిన మోర్లె నిర్మల, కాగజ్‌నగర్ మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన దుర్గం వెంకటమ్మ వేర్వేరుగా అర్జీ సమర్పించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్రానికి చెందిన సహేరా బేగం దరఖాస్తు చేసుకుంది. మర్తిడి గ్రామ శివారులో తన తాతకు ఇచ్చిన ఇనాం భూమిని వేరొకరు పట్టా చేసుకున్నారని, దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన శ్రీరాముల భీమేశ్ వేడుకున్నాడు. గిరి వికాస్ పథకం కింద బోర్‌వెల్ మంజూరు చేయాలని జైనూర్ మండలం పాట్నాపూర్‌కు చెందిన పలువురు రైతులు కోరారు.

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యల పరిష్కారం వచ్చిన బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి, ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలో న్యాయం చేసేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి



భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: దళితుల్లో చైతన్యం, విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి భాగ్యరెడ్డివర్మ అని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవిత విశేషాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో 26 పాఠశాలలు ప్రారంభించారని తెలిపారు. దళిత మహిళలకు విద్యనందించేందుకు అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, షెడ్యూల్డ్ కులాల మానిటరింగ్ సభ్యులు కేశవ్‌రావు, గోపాల్, అశోక్, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత 'బెజ్జూర్'



బెజ్జూర్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎస్పీ

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో దహెగాం, బెజ్జూర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బెజ్జూర్ జట్టు అద్భుత ఆటతీరుతో దహెగాంపై విజయ కేతనం ఎగురవేసి టోర్నీ విజేతగా నిలిచింది.

జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యం

ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి రాత్రి వాలీబాల్ పోటీల విజేతకు బహుమతుల ప్రదానం చేశారు. క్రీడాకారులకు సౌకర్యాల కల్పన, పోటీల నిర్వహణకు కృషి చేసిన డీఎస్పీ శ్రీనివాస్, రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బెజ్జూర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.15,116 నగదుతో పాటు షీల్డ్, రెండోస్థానంలో నిలిచిన దహెగాం జట్టుకు రూ.10,116 నగదు బహుమతి, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో గోలేటి సర్పంచ్ పోటు సుమలత, వాంకిడి సీఐ శ్రీనివాస్, తిర్యాణి ఎస్సై రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు రాసేందుకు ప్రత్యేక కౌంటర్లు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు రాసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. నిరక్షరాస్యులకు చెందిన దరఖాస్తులు రాసేందుకు ఉద్యోగులను ప్రత్యేక నియమించినట్లు వెల్లడించారు. ఇక నుంచి బయటి వ్యక్తులతో అర్జీలు రాయించొద్దని సూచించారు. ప్రైవేట్ వ్యక్తులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అనేక ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, ఈ విషయమై ఎవ్వరూ దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ జిల్లా టీం హెడ్ చంద్రకళ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని విత్తనాల షాపుల్లో హెచ్‌టీ కిట్‌తో బీటీ 3 విత్తనాల గుర్తింపునకు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి, రశీదు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు, విడిగా విత్తనాలు అమ్మితే పోలీసులు, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వాంకిడి మండల కేంద్రంలో..

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీ బృందం హెడ్ చంద్రకళ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు సమయంలో రశీదు తీసుకోవాలన్నారు. డీలర్లు నిబంధనల మేరకు రికార్డులు నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో సీడ్ సర్టిఫికేషన్ అధికారి దుర్గేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సుధాకర్, ఏడీఏ మిలింద్, ఏవో ఖాదర్ హుస్సేన్, వాంకిడి ఎస్సై సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంతోపాటు మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ చంద్రకళ, ఎస్సై సందీప్ సోమవారం తనిఖీలు చేపట్టారు. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం



ఖోఖోలో తలపడుతున్న జట్లు

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడలతో యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంతో ఉంటారని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో సోమవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆటలపోటీలు నిర్వహిస్తుందన్నారు. ఎండలు తీవ్రత నేపథ్యంలో రాత్రి పూట నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 24 వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. యువత ప్రతిభ చూపి, జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. డీటీడీవో మణెమ్మ, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో శశికళ, పీడీలు, పీఈటీలు మధుసూదన్, రాకేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: ఓటరు జాబితా తయారీలో బూత్‌స్థాయి అధికారులు తహసీల్దార్లకు సహకరించాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

'పాత చోటుకే మార్కెట్ తరలించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: జుబ్లీ మార్కెట్‌లో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ వద్ద నిర్వహించిన పాత చోటుకే తరలించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. సోమవారం జుబ్లీ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలను నిలిపివేసి నిరసన తెలిపారు. మంగళవారం కూడా మార్కెట్ బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపారులు మాట్లాడుతూ జుబ్లీ మార్కెట్ ప్రజలకు దూరం కావడం, సమీపంలో చికెన్, మటన్ దుకాణాలు ఉండటంతో అమ్మకాలు సక్రమంగా జరగడం లేదన్నారు. కూరగాయల మార్కెట్‌ను 'జుబ్లీ'కి తరలించిన తర్వాత అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మార్కెట్‌ను పాత స్థలానికి మార్చేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందాబాయి, మహంకాళీబాయి, మంజుల, శాంతాబాయి, పోచుబాయి, తిరుపతి, నారాయణ, అమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి వీవోఏల యత్నం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు, సీఐటీయూ నాయకులు

- అడ్డుకుని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: డిమాండ్ల సాధన కోసం ఐకేపీ వీవోఏలు కదం తొక్కారు. నిరవధిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కార్యాలయం గేటు ఎదుట సుమారు రెండు గంటల పాటు బైఠాయించారు. న్యాయం చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా ప్రత్యేక వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పలువురు వీవోఏలు స్వల్పంగా గాయపడ్డారు. పోలీస్‌స్టేషన్ వద్ద కూడా తమ నిరసన తెలిపారు. నాయకులు శ్రీనివాస్, రాజేందర్ మాట్లాడుతూ 35 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా వీవోఏలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్నా మహిళలను ఈడ్చుకుంటూ వెళ్లారని ఆరోపించారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో షైమా, రమ, సునీత, వినోద్, గణేశ్, కల్పన, శ్రీలత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని అడ్డుకునేదెవరు?

- మా వెనుక పోలీసు, రెవెన్యూ ఉంది
- హైవే పక్కన ఉన్న రెండెకరాల భూమి మాదే
- 66/బి సర్వే నంబర్ భూమిని కబ్జా చేసిన వ్యక్తి హెచ్చరికలు



హైవే పక్కన చదును చేసిన స్థలం

సాక్షి, ఆసిఫాబాద్: 'హే బాప్.. చోడ్‌దే ఉస్‌కో.. మై కౌన్ హూ తేరేకు మాలూం.. జయ అంటీ మాలూం తేరేకు.. లల్లూ అంకుల్ మాలూం తేరేకు..' ఓ చిత్రంలో హీరో విలన్‌ను కొడుతుంటే అతని స్నేహితుడు మాట్లాడే డైలాగ్ ఇది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అక్రమంగా రెండెకరాల స్థలాన్ని కబ్జా చేసిన ఓ వ్యక్తి సైతం సినిమా డైలాగ్‌ను తలదన్నే రీతిలో 'ఆ స్థలాన్ని మాకు వదిలేయండి. మా వెనుక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు. వారంతా మాకు అండగా ఉన్నారు. మమ్మల్ని అడ్డుకునే దమ్మేవరిది.' అంటూ బహిరంగంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది.

'హద్దులు చెరిపి.. కబ్జా చేసి!'అనే శీర్షికతో బుధవారం 'సాక్షి' దినపత్రికలో ఓ కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కథనాన్ని చూసిన వెంటనే ఉరుకులు పరుగులు మీద తన కబ్జాల గురువును కలిసిన సదరు వ్యక్తి.. అనంతరం కొందరు మిత్రుల వద్ద 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ.. 'పత్రికల్లో అనేక కథనాలు వస్తుంటాయి. వాటిని చూసి భయపడాల్సిన అవసరం లేదు. మేము స్థలాన్ని కొన్నాం. అందులోనే చదును చేశాం. వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముతాం. అడ్డుకునే దమ్ము ఎవరికుంది? అయినా అడ్డుకుంటే.. మా వెనుక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు. అధికార పార్టీ నేతలు సైతం మాకే మద్దతు ఇస్తారు. పరిస్థితి మా చేతుల్లో నుంచి జారితే మా గురువు రంగంలోకి దిగుతారు. అవసరమైతే హైకోర్టుకు వెళ్లి అనుకూలంగా ఉత్తర్వులు తెస్తారు. లేదంటే రౌడీలు ఉండనే ఉన్నారు కదా!' అని చెప్పినట్లు సమాచారం.

హడావుడిగా సర్వేయర్‌తో కొలతలు..

67 సర్వే నంబరులో ఉన్న రెండెకరాల భూమిని కొనుగోలు చేసి.. 66/బి సర్వే నంబరులోని రెండెకరాల భూమిని కబ్జా చేసిన సదరు వ్యక్తులు 'సాక్షి' కథనంతో సర్దుబాటు చర్యలకు దిగినట్లు సమాచారం. సర్వేయర్‌ను మాట్లాడుకుని శుక్రవారం తెల్లవారుజామున తమ స్థలం ఎక్కడ ఉంది? హద్దులు ఏవి? అని హడావుడిగా కొలతలు వేయించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలోనూ రికార్డులు పరిశీలించి.. తమకు అనుకూలంగా సర్వే ఉండేలా చూడాలని రెవెన్యూ ఉన్నతాధికారిని కోరినట్లు సమాచారం. మొత్తం మీద తప్పుడు హద్దులతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కబ్జాదారులు.. ఇప్పుడు వాటిని నిజం చేసే ప్రయత్నాలు ముమ్మరం చేయడం గమనార్హం. మరోవైపు ఇదే అంశంపై పోలీసుశాఖ ఉన్నతాధికారి ఒకరు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

రైలు కింద పడి ఒకరి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని వంజీరి రైల్వేగేటు సమీపంలో సోమవారం గుర్తుతెలియని రైలు నుంచి కిందపడి ఒకరు మృతి చెందాడు. రాళ్లపేట–సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ రైల్వేస్టేషన్‌ల మధ్య వంజీరి రైల్వేగేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ సురేష్‌గౌడ్‌ తెలిపారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటాడని, నీలి కలర్‌ ఫుల్‌షర్ట్‌, చాక్లెట్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నాడని, కుడి చేతికి తెల్లని కడియం, మెడలో స్టీల్‌చైన్‌, కుడి చేతిపై మరియమ్మ అని కన్నడంలో రాసి ఉందని పేర్కొన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్‌ (టి) ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

దహెగాం: మండలంలోని రాళ్లగూడ గ్రామంలో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పలువురు ఇళ్లలో సోమవారం సోదాలు నిర్వహించారు. బిమన్‌కర్‌ పురుషోత్తం ఇంట్లో 9 కిలోలు, వగాడె చినబాపు ఇంట్లో 11 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, వగాడె బాపురావ్‌ ఇంట్లో 100 లీటర్ల నిషేధిత గడ్డి మందు, 55 ప్యాకెట్ల గడ్డి మందు పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్‌ తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ముగ్గురు ఉన్నారన్నారు. వాటి విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

నాసిరకం విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

తాండూర్‌: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ హెచ్చరించారు. సోమవారం తాండూర్‌లోని బాలాజీ ఫర్టిలైజర్స్‌ షాపులో తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న విత్తనాలు పరిశీలించారు. స్టాక్‌, అమ్మకం వివరాలు, రిజిష్టర్‌, బిల్లుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయానికి సంబంధించి విధిగా రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. తాండూర్‌ సీఐ జగదీష్‌, బెల్లంపల్లి రూరల్‌, మందమర్రి సీఐలు రాజ్‌కుమార్‌గౌడ్‌, మహేందర్‌రెడ్డి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌ సీఐ అశోక్‌కుమార్‌, పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని కాపువాడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆరెగూడ నివాసి అంకతి జగత (63) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా.. మండలంలోని ఆరెగూడ గ్రామస్తులు ఆదివారం మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని ఎల్లారంలో పుట్టివెంట్రుకల వేడుకలో పాల్గొన్నారు. ఆటోలో తిరిగి ఇంటికి పయనమయ్యారు. కాగజ్‌నగర్‌ పట్టణంలోని కాపువాడ వద్ద ట్రాక్టర్‌, ఆటోను ఢీకొనడంతో ముద్దసాని సీనయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన జగతను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విత్తనాల ఎంపికే కీలకం

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుంది. రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం దగ్గరపడింది. పత్తితో పాటు కంది, పెసర, వరి, కూరగాయలకు సంబంధించి నకిలీ విత్తనాలు మార్కెట్‌లో వస్తున్నాయి. ఆయా కంపెనీల యాజమాన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు ఆఫర్‌ చేస్తున్నాయి. గ్రామాల్లో డీలర్లు, కంపెనీ సిబ్బంది వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్‌, మైక్‌సెట్‌ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు నమ్మి రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఒకటి రెండుసార్లు ఆలోచించి నిర్ధారణకు వచ్చాకే కొనుగోలు చేయాలి. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్‌, చెన్నూర్‌ ఏడీఏ జాడి బాపు చెబుతున్నారు. నాణ్యమైనవి, గుర్తింపు పొందిన విత్తనాలు కొనాలని సూచిస్తున్నారు.

– మంచిర్యాలఅగ్రికల్చర్‌/చెన్నూర్‌రూరల్‌


జొన్న విత్తనాలు

- ఒకటికి రెండుసార్లు ఆలోచించూ అన్నదాత
- నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు..

- విత్తన ఎంపికలో, ఎరువుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌ చౌహాన్‌ సూచనలు అందిస్తున్నారు.
- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్‌ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- గడువు దాటినా విత్తనాలు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయొద్దు.
- బిల్లుపై విక్రయదారుని పేరు, ప్రభుత్వాల అమ్మకాల పన్ను నెంబర్‌, విక్రయదారుడి సంతకం, తేదీ, రకం పేర్లు, బ్యాచ్‌నంబర్‌, గడువు తేదీలు, నికర తూకం, ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్‌

- కొనుగోలు చేసిన సరుకును డీలర్‌ వద్ద తూకం వేయించాలి.

పురుగుల మందు ఎంపికలో..

- పంటలో చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులే వాడాలి.
- నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్‌ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై చక్రా ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే డబ్బాలపై ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- ఒక పంటకు వాడిన పురుగుల మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనలతో వాడాలి.

ఎరువులు కొనుగోలులో..

- లైసెన్స్‌ షాపుల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి.
- మిషన్‌ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్‌ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- చిల్లలు పడి, చిరిగిన ఎరువుల బస్తాల కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

కల్తీ గుర్తించడం..

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ వంటి ఎరువుల గుళికలు రూపంలో ఉంటాయి. ఎరువుల ఇసుక రేణువుల రూపంలో, పొటాష్‌, సూపర్‌ఫాస్పేట్‌ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీ లీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్‌ ఎరువుల పరీక్షకు 10 మి.లీ పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- యూరియా వంటి ఎరువును ఒక చెంచాను 5 మి.లీ పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్‌ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశముంది. అలా వస్తే కల్తీ ఎరువుగా గుర్తించాలి.

చరిత్రాత్మక ఒప్పందం సాధించాం

శ్రీరాంపూర్‌: బొగ్గుగని కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో చరిత్రాత్మక ఒప్పందం సాధించామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్‌ బి.జనక్‌ప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేతన ఒప్పందంలో ఐఎన్టీయూసీ చురుకైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్‌, 25 శాతం అలవెన్సుల పెంపుతో వేతనాలు మెరుగ్గా పెరుగుతున్నాయని అన్నారు. ఈ ఒప్పందం వల్ల డెయిలీ రేటెడ్‌ కార్మికులకు రూ. 2.7 లక్షల నుంచి రూ.3.16 లక్షల వరకు ఏరియర్స్‌ వస్తాయని పేర్కొన్నారు. మంత్లీ రేటెడ్‌ కార్మికులకు రూ. 2.77 లక్షల నుంచి రూ. 4.91 లక్షలు వస్తాయని తెలిపారు.

బెల్లంపల్లి పీహెచ్‌డీ స్కాలర్‌కు జాతీయ అవార్డు


మహేశ్‌కుమార్‌

బెల్లంపల్లి: బెల్లంపల్లి చెందిన ఓ పీహెచ్‌డీ స్కాలర్‌కు ఆదివారం జాతీయ ఉత్తమ అవార్డు వరించింది. అంబేద్కర్‌ రడగంబాల బస్తీలో నివాసం ఉంటున్న సింగరేణి రిటైర్డ్‌ కార్మికుడి కుమారుడు రామగిరి మహేశ్‌కుమార్‌ ఫిషరీ సైన్స్‌ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. గుజరాత్‌ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని గ్లేషియర్‌ జనరల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నేషనల్‌ అవార్డ్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌–2023 గాను గ్లోబల్‌ మేనేజ్‌మెంట్‌ కౌన్సిల్‌ ఫిషరీ సైన్స్‌లో టీచింగ్‌, రీసెర్చ్‌, పబ్లికేషన్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 'ఆదర్శ్‌ విద్యా సరస్వతీ రాష్ట్రీయ పురస్కార్‌' ఉత్తమ పీహెచ్‌డీ అవార్డుకు ఆయన ఎంపికయ్యాడు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనకు ఉత్తమ అవార్డు రావడం పట్ల మహేశ్‌కుమార్‌ సంతోషం వ్యక్తం చేశారు. తాను పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని 'సాక్షి'తో అన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): జూన్‌ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఏరియాలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం దేవేందర్‌ సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో వేడుకల ఏర్పాట్లపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వేడుకల నిర్వహణ కోసం మైదానాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. స్వాగతం మొదలుకొని, ఉత్తమ ఉద్యోగుల ఎంపిక, క్రీడా పోటీలు, బహుమతులు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు ప్రతి అంశంపై అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏరియా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అన్నారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్‌ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీశ్‌బాబు, పీవో ఉమాకాంత్‌, పర్సనల్‌ మేనేజర్‌ లక్ష్మణరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్‌

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం

జైపూర్‌: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే మన లక్ష్యంగా కార్మికులు ముందుకు సాగాలని బెల్లంపల్లి రీజియన్‌ రక్షణ జీఎం జాన్‌ ఆనంద్‌ తెలిపారు. జైపూర్‌ మండలం ఇందారం ఐకే–ఓసీపీపై సోమవారం రవాణా భద్రత అవగాహన పక్షోత్సవాలు పురస్కరించుకుని కార్మికులు, ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు రక్షణసూత్రాలు పాటిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఉద్యోగులు, యూనియన్‌ నాయకులు కలిసి కట్టుగా ప్రమాదాల నివారణకు రక్షణ సూత్రాలు పాటించినప్పుడే జీరో హార్మ్‌ సింగరేణిగా మార్చుకోవచ్చని తెలిపారు. అనంతరం ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌, రక్షణాధికారి శ్రీధర్‌, అధికారులు విజయ్‌కుమార్‌, బ్రహ్మజీరావు, రమేశ్‌, పిట్‌కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రక్షణ జీఎం జాన్‌ ఆనంద్‌

ఎంసీహెచ్‌లో నవజాత శిశువు మృతి

- వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే..
- ఆసుపత్రిలో తల్లిదండ్రులు, కుటుంబీకుల ఆందోళన

మంచిర్యాలటౌన్‌: జిల్లాకేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సరైన చికిత్స అందక మూడు రోజుల నవజాత శిశువు సోమవారం మృతిచెందింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ శిశువు తల్లిదండ్రులు, కుటుంబీకులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఆసుపత్రి అద్దాలను పగులగొట్టారు. సమాచారం అందుకున్న మంచిర్యాల పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. పాప మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీహెచ్‌ ఇన్‌చార్జి, ఆర్‌ఎంవో డాక్టర్‌ భీష్మకు శిశువు తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్‌ మండలం దొనబండకు చెందిన కూలీ పని చేసుకునే మానుపాటి రమేశ్‌ తన భార్య లావణ్య ప్రసవం కోసం ఈనెల 19న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్చాడు. అదేరోజు సాయంత్రం సాధారణ ప్రసవం జరగ్గా, పాప జన్మించింది. ఈనెల 20న రాత్రి నుంచి పాపకు తీవ్ర జ్వరం రాగా, డాక్టర్‌ వద్దకు వెళ్తే అందుబాటులో లేరు. డ్యూటీలో ఉన్న నర్సు సిరప్‌ ఇచ్చింది. తగ్గకపోవడంతో 21న పాపకు సిరప్‌ ఇవ్వగా, సాయంత్రం 6 గంటలకు డాక్టర్‌ వద్దకు తీసుకెళ్లగా మరోటి సిరప్‌ ఇచ్చారు. రాత్రి జ్వరం తీవ్రం కావడంతో బాక్సులో పెట్టారు. వైద్యులు డ్యూటీకి రాలేదని, ఉదయం పరీక్షిస్తారని నర్సులు చెప్పారు. సోమవారం విధులకు హాజరైన వైద్యుడు పాపను పరిశీలించి మృతిచెందిందని నిర్ధారించారని, సరైన సమయంలో వైద్యం అందిస్తే బతికేదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పాప మృతికి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.


మృతి చెందిన నవజాత శిశువు


ఆర్‌ఎంవో డాక్టర్‌ భీష్మకు వినతిపత్రం అందిస్తున్న శిశువు తండ్రి రమేశ్‌


పగిలిన ఆసుపత్రి అద్దాలు

వైద్యులు ఎప్పుడు వస్తరో తెలీదు..

ఆసుపత్రిలో పలువురి బాలింతల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పిల్లల వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రసూతి వరకు వైద్యం బాగానే చేస్తున్నా, పిల్లలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎంసీహెచ్‌లో నలుగురు పిల్లల వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. సాధారణ ప్రసవాలపై పెడుతున్న దృష్టి, పుట్టిన పిల్లలకు వైద్యం అందించడంలో చూపించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాలువలోకి దూసుకెళ్లిన బైక్‌

- నీటిలో మునిగి భార్య మృతి
- ప్రాణాలతో బయటపడిన భర్త


వడ్డె సాక్రుబాయి(ఫైల్‌)

వాంకిడి: అదుపుతప్పిన బైక్‌ ప్రమాదవశాత్తు కుమురంభీం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువలో దూసుకెళ్లిన ఘటనలో భార్య మృతిచెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. మండలంలోని ఇందాని(మోకాసిగూడ) సమీపంలో ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్‌ కథనం ప్రకారం.. మండలంలోని లెండిగూడ గ్రామానికి చెందిన వడ్డె ఇంద్రాజీ–సాక్రుబాయి(28) దంపతులు గత 9 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం బాబు పుట్టిన వెంటనే చనిపోయాడు. అప్పటి నుంచి మళ్లీ సంతానం కలగకపోవడంతో పిల్లల కోసం గత మూడు నెలల నుంచి బెండార శివారులో గల శంకరుని ఆలయంలో ప్రతీ శని, సోమవారాలు పూజలు నిర్వహించేవారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 5.30 గంటలకు ఇంద్రాజీ, సాక్రుబాయి దంపతులు బెండార శంకరుని గుడికి వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. కుమురంభీం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ మీదుగా ఉన్న బీటీ గుండా వెళ్తుండగా మోకాసిగూడ–సరాండి గ్రామాల మధ్యలో ఉన్న మూలమలుపు వద్ద బైక్‌ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. బైక్‌తోపాటు ఇద్దరు నీటిలో మునిగారు. ఇంద్రాజీకి ఈత రావడంతో వెంటనే తేరుకుని భార్యను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశాడు. కాలువకు సిమెంటు లైనింగ్‌ ఉండటంతో నీళ్లలో నుంచి బయటికి రాలేకపోయాడు. కొంత సమయానికి అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి సహాయంతో భార్యను బయటికి తీసుకొచ్చాడు. కానీ అప్పటికే సాక్రుబాయి మృతి చెందింది. కాలువలో నీళ్లతో పాటు నాచు, పూడిక అధికంగా ఉండటంతో బాధితులు బయటపడటంలో ఆలస్యమై ఉంటుందని అక్కడున్న వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నీటిలో మునిగిన బైక్‌ను పోలీసులు స్థానికుల సహాయంతో బయటికి తీశారు. మృతురాలి తండ్రి ఆదె మోతీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదు సమస్యల గుర్తింపు

- 'ధరణి'పై 'సాధిక్‌ ఫౌండేషన్‌' అధ్యయనం
- జిల్లాలో రెండు మండలాల్లో అభిప్రాయాల సేకరణ


'సాధిక్‌ ఫౌండేషన్‌' ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై అభిప్రాయ సేకరణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రెవెన్యూ పోర్టల్‌ 'ధరణి'లో భూ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'సాధిక్‌ ఫౌండేషన్‌' అధ్యయనం చేసింది. ఈ నెల 19, 20, 22 తేదీల్లో లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల, వెంకటాపురం, ముత్యంపేట గ్రామాలు, దండేపల్లి మండలం కోయపోచగూడ గ్రామస్తులను కలిసి భూ వివాదాలపై వివరాలు సేకరించారు. ఈ మూడు గ్రామాల్లో ప్రధానంగా ఐదు సమస్యలు గుర్తించారు. ఆ సమస్యల పరిష్కారం చూపేలా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ చైర్మన్‌ సాధిక్‌ అలీ 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో ఏర్పడిన ఐదు భూ సమస్యలపై వివరించారు.

సమస్యలివీ

- ధరణి పోర్టల్‌లో కబ్జా కాలం లేకపోవడంతో ఏళ్లుగా భూమిపై కాస్తులో ఉన్న వారికి హక్కులు లేకుండా పోతోంది.
- పట్టా మార్పిడికి పాత పట్టాదారులు డబ్బులు డిమాండ్‌ చేయడం, లేక తిరుగుబాటు చేస్తున్నారు.
- వారసత్వ పట్టా చేసుకోవాలంటే ఆ కుటుంబ సభ్యులు అందరూ రావాలంటే సమస్యలు తలెత్తున్నాయి. తమ వాటాల కోసం వారసుల మధ్య తగాదాలు వస్తున్నాయి.
- పోడు సంబంధించిన ఎటువంటి మాడ్యూల్‌, పీసా చట్టం లేకపోవడంతో గిరిజనులకు ఎదురవుతున్న ఇబ్బందులు
- భూ సర్వేలు సమగ్రంగా అంటే ప్రభుత్వం చెప్పినట్లు అక్షాంశాల, రేఖాంశాల జరగకపోవడంతో హద్దుల మధ్య తగాదాలు
- పట్టణాలు, గ్రామాల్లో వెలిసిన వెంచర్లలో 'నాలా' లేకుండా ఉన్న ప్లాట్ల గతంలో ఉన్న పట్టాదారుపైనే భూములు ఉండడం. రైతుబంధు కోసం, ఇతర పథకాల కోసం కోర్టులకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకుని ఇబ్బందులు పెడుతున్నారు.

అటవీశాఖ అధికారుల ఆంక్షలు సడలించాలి

జన్నారం: కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మేదరి కులస్తులపై అటవీ శాఖ అధికారుల ఆంక్షలు సడలించాలని కోరుతూ మంత్రి ఐకేరెడ్డికి ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి మేదరి కులస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘ నాయకులు మాట్లాడుతూ వెదురు వృత్తిదారులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని, వెదురుద్వారా తయారు చేసిన వస్తువుల అమ్మకంలో ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. డబుల్‌ బెడ్రూం ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా మేదరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. అదేవిధంగా జన్నారం మండల వ్యాపారుల ఇబ్బందులను గుర్తించి భారీ వాహనాలను ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రాకపోకలకు అనుమతి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు కోరారు. వైస్‌ ఎంపీపీ వినయ్‌కుమార్‌, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్‌, ఎంపీటీసీ రియాజొద్దీన్‌, మహేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, నాయకులు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మేదరి కులస్తులు

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌ ముట్టడి

మంచిర్యాలఅగ్రికల్చర్‌: సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు సోమవారం కలెక్టరేట్‌ ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఐకేపీ వీవోఏల జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్‌ మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని తెలిపారు. వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆన్‌లైన్‌ పనులు రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటాల కుమార్‌, లింగంపల్లి వెంకటేష్‌, రమాదేవి, రజిత, పుట్టపోషం, అన్వార్‌, అలీమ్‌, సురేష్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌హెచ్‌ ఉన్నతాధికారుల రాక

- ఎన్‌హెచ్‌ బాధితుల డిమాండ్లపై ఆరా
- విస్తరణ విషయంలో నివేదిక అందించాలని అధికారులకు కేంద్రమంత్రి నితిన్‌ గడ్కరీ ఆదేశం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మంచిర్యాల–ఆర్మూర్‌ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి 63 విస్తరణ రహదారి సర్వే పనులు నిలిపివేయాలంటూ ఎన్‌హెచ్‌ బాధితులు గత 20 రోజులుగా నిరసన దీక్ష చేపడుతున్నారు. ఓ వైపు దీక్ష చేపడుతూనే ప్రస్తుతం విస్తరణకు సంబంధించి రోడ్ల ప్లాన్‌ను మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి మొదలు రాష్ట్ర, కేంద్రమంత్రులు, ఎన్‌హెచ్‌ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో ఇటీవల కేంద్ర రోడ్లు, రవాణా శాఖా మంత్రి నితిన్‌ గడ్కరీని కలిసిన నేపథ్యంలో విస్తరణ విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఎన్‌హెచ్‌ రీజినల్‌ ఆఫీస్‌ హైదరాబాద్‌ నుంచి ఉన్నతాధికారులు జిల్లాకు రానున్నారు. వీరితో పాటు జిల్లా ఎన్‌హెచ్‌ఏఐ పీడీ కె.ఎం.అజయ్‌మణికుమార్‌ కూడా పాల్గొననున్నారు. ఎన్‌హెచ్‌ బాధితులను నేరుగా కలిసి రహదారి విస్తరణలో తలెత్తుతున్న సమస్యలు, ఇబ్బందులను పరిశీలించి నివేదికను కేంద్రానికి అందజేయనున్నారు.